నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
06.
nipuna
Every Wednesday Free Supplement
24 ఏప్రిల్ 2024
పేజీలు 8

### రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్ బెంగళూరు (ఆర్‌సీబీ) చాంపియన్‌గా నిలిచింది. మార్చి 17న జరిగిన ఫైనల్లో ఆర్‌సీబీ 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. **రష్మిక:** ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక రన్నరప్‌గా నిలిచింది. ఇండోర్‌లో మార్చి 18న జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో డలైలా జకుసోవిచ్ (స్లొవేనియా) గెలుపొందింది.

## ఒలింపిక్ కల చేజారి.. సివిల్స్ నెరవేరి

ఆమె బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. 56 జాతీయ పతకాలు, 19 అంతర్జాతీయ పతకాలు సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో 34వ స్థానంలో ఉన్న ఆమె అనుకోని సంఘటనతో ఆటకు దూరమయ్యింది. సివిల్స్ లక్ష్యం నెరవేర్చుకుంది కుహూ గార్గ్. ఆమె విజయ ప్రస్థానం ఆమె మాటల్లో..

కుహూ గార్గ్
**178వ ర్యాంక్**



**కుటుంబం, చదువు**

- మాది డెహ్రాడూన్. నాన్న అశోక్ కుమార్ 1989 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్. ఆయన ఉత్తరాఖండ్ డీజీపీగా పని చేశారు. తొమ్మిదేండ్ల నుంచే బ్యాడ్మింటన్ ఆడటం మొదలుపెట్టాను. 13వ ఏట నుంచే పతకాలు గెలవడం మొదలుపెట్టాను. జాతీయ, అంతర్జాతీయ పతకాలు గెలుచుకున్నాను. అలా ఆడుతూనే ప్రాథమిక విద్య డెహ్రాడూన్‌లో పూర్తి చేశాను. ఒలింపిక్ పతకం సాధించాలనేది నా కల.
- కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్టు, నాన్న బాటలోనే నడవాలనే రాసిపెట్టిందేమో.. కొవిడ్ తర్వాత ఉబెర్ కప్ కోసం ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో మోకాలికి గాయమయ్యింది. ఆపరేషన్ చేసినా కొన్నేళ్లు మైదానంలో అడుగుపెట్టొద్దన్నారు డాక్టర్లు. డాక్టర్లు చెప్పింది విని తట్టుకోలేకపోయాను. కుంగిపోయాను.
- అప్పుడు చదువుపై దృష్టి సారించాలని ఇంట్లోవాళ్లు చెప్పారు. నాన్న ఏవైనా స్ఫూర్తివంతమైన స్టోరీలు చదవమని సలహా ఇచ్చారు. చిన్నప్పటి నుంచి నాన్నే స్ఫూర్తి. ఆయన ఎందరికో సాయం చేసి పేరు తెచ్చుకున్నారు. నాన్న నాకూ నీలా కావాలనుంది అని అడిగాను. అందుకు నాన్న చాలా కష్టపడాలి, పుస్తకాలతో కుస్తీ పట్టాలి అని చెప్పారు.
- సీరియస్‌గా తీసుకుని ఢిల్లీలోని ఎస్ఆర్‌సీసీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. సివిల్స్‌కు సిద్ధమయ్యాను. నా పట్టుదల చూసి నాన్న మెటీరియల్ సమకూర్చి, అర్థం కాని అంశాలను విశ్లేషించి చెప్పారు. దీంతో సివిల్స్‌లో 178వ ర్యాంకు సాధించాను.

## వీల్‌చైర్ చదువు నుంచి వీవీఐపీ కొలువు దాకా..

హాయిగా సాగిపోతున్న జీవితంలో అనుకోని వ్యాధితో మంచానపడితే ఆ బాధ వర్ణనాతీతం. చాలామంది జీవితం మీద ఆశ వదులుకుని ఆయువు తీసుకుంటారు. కానీ హనిత మాత్రం వీల్‌చైర్‌లోనే చదువుతూ వీవీఐపీ అవ్వాలనుకుంది. అలా సివిల్స్‌లో ర్యాంక్ సాధించింది. అనితరసాధ్యాన్ని సుసాధ్యం చేసుకున్న విశేషాలు ఆమె మాటల్లో..

వేములపాటి హనిత
**887వ ర్యాంక్**

**కుటుంబం, చదువు**

- మాది విశాఖపట్నం. నాన్న రాఘవేంద్రరావు, అమ్మ ఇందిర. నాన్న రైల్వేలో, అమ్మ ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. 91 శాతం మార్కులతో ఫిట్జీలో ఇంటర్ పూర్తి చేశాను. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అగ్రికల్చరల్ అండ్ ఫుడ్ ఇంజినీరింగ్‌లో చేరాను.
- మొదటి సంవత్సరంలో ఒక రోజు తీవ్రమైన వెన్నునొప్పితో రెండు కాళ్లు తిమ్మిర్లెక్కి, పడిపోయాను. నాకు వచ్చిన ఈ సమస్య ట్రాన్స్‌వెర్స్ మై ఎలైటిస్ ఆటోఇమ్యూన్ డిసీజ్ (వెన్నెముకకు సంబంధించిన వ్యాధి) అని వైద్యుల ద్వారా తెలిసింది.
- జీవితాంతం వీల్‌చైర్‌కే అంకితం కావాల్సిందే అన్నప్పుడు నేను, తల్లిదండ్రులం కుమిలి కుమిలి ఏడ్చాం. రెండేళ్లు గదిలోంచి బయటికి రాలేదు. గురువు చదువును కొనసాగించమని, పోటీ పరీక్షలకు ప్రయత్నించమని ప్రోత్సహించారు.
- ఐఐటీ పూర్తి చేసే అవకాశం లేకపోవడంతో దూరవిద్యలో డిగ్రీ చదివాను.
- 2020లో మొదటిసారి సివిల్స్ ప్రిలిమ్స్ పాసయ్యాను. మెయిన్స్ పాస్ కాలేకపోయాను. గ్రూప్స్ రాసి వైద్యారోగ్య శాఖలో పర్యవేక్షణాధికారిగా ఉద్యోగం సాధించాను. ఉద్యోగం చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ సాగించాను. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్ క్లియర్ చేశాను. బాలలత మేడం దగ్గర మాక్ ఇంటర్వ్యూలకు హాజరయ్యాను.

## నా కుటుంబమే స్ఫూర్తి..

దినపత్రికల్లో వచ్చిన సక్సెస్ స్టోరీలే ఆమెను సివిల్స్ వైపు వచ్చేలా చేశాయి. దానికితోడు కుటుంబాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రిపరేషన్ కొనసాగించింది. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్ 30 మార్కులతో చేజారినా నిరాశ చెందలేదు. ఐదో అటెంప్ట్‌లో ర్యాంకు సాధించి తన కల నెరవేర్చుకుంది సాయి అలేఖ్య. ఆమె ప్రిపరేషన్ వివరాలను 'నిపుణ'తో పంచుకున్నారిలా..

సాయి అలేఖ్య రావూరి
**938వ ర్యాంక్**

**కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం?**

- మాది గోవిందాపురం గ్రామం, ఖమ్మం జిల్లా. నాన్న ప్రకాశ్‌రావు హెడ్ కానిస్టేబుల్, అమ్మ పద్మశ్రీ గృహిణి. మధ్యతరగతి కుటుంబం. ఖమ్మంలో పదో తరగతి వరకు, విజయవాడలో ఇంటర్, హైదరాబాద్‌లో డిగ్రీ, వారణాసిలో ఎంఏ రూరల్ డెవలప్‌మెంట్ పూర్తి చేశాను.

**సివిల్స్ వైపు రావడానికి స్ఫూర్తి ఎవరు, కోచింగ్ తీసుకున్నారా?**

- నా కుటుంబమే నాకు స్ఫూర్తి. ఇదే కాకుండా దినపత్రికల్లో వచ్చే సక్సెస్ స్టోరీలు చూసి ఇటువైపు అడుగేశాను. సొంతంగానే ప్రిపేరవుతూ బాలలత మేడం సలహాలు పాటించాను. ఆంత్రోపాలజీలో విష్ణు సర్ టెస్ట్ సిరీస్ రాశాను. ఎటువంటి సందేహాలున్నా అక్కడే నివృత్తి చేసుకునేదాన్ని.

**ప్రిపరేషన్ ఎలా జరిగింది, ఏ మెటీరియల్ చదివారు?**

- 2019 నుంచి చదువుతున్నాను. NCERT తో పాటు ఇతర స్టాండర్డ్ బుక్స్ ప్రిపేరయ్యాను. రోజూ 8 గంటలు చదువుతూ పరీక్ష సమీపిస్తున్న కొద్ది 15 గంటల వరకు పుస్తకాలతో కూర్చున్నాను. కరెంట్ అఫైర్స్ కోసం ప్రతిరోజు దినపత్రికలు తిరగేశాను. నాలుగో అటెంప్ట్‌లో మెయిన్స్ 30 మార్కులతో చేజారింది. ఇప్పుడు ఐదో ప్రయత్నంలో 938వ ర్యాంకు సాధించాను. ఆప్షనల్‌గా ఆంత్రోపాలజీ ఎంచుకున్నాను. ఏ సర్వీస్ వచ్చినా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. అంతకు ముందు గ్రూప్-1 రాసినప్పటికి రద్దయింది.



**ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలు?**

- శీల్‌వర్ధన్ సింగ్ బృందం ఇంటర్వ్యూ చేసింది. 30 నిమిషాల పాటు కొనసాగింది. తెలంగాణపై ఏం అడగలేదు. అంతర్జాతీయంగా రష్యా – ఉక్రెయిన్ యుద్ధం.. అందులో యూరప్ పాత్ర, ఇజ్రాయెల్ – గాజా దాడులు, భారతదేశ చరిత్రకు సంబంధించి సుమారు 28 ప్రశ్నలు అడిగారు. ఒకదానికి మినహా అన్నింటికి సమాధానమిచ్చాను.

**కాంపిటేటివ్ అభ్యర్థులకు మీ సలహాలు, సూచనలు?**

- ముందుగా ఒక లక్ష్యం అంటూ ఏర్పరచుకోవాలి. దానిపై నమ్మకం కలిగి ఉండటం ప్రధానం. ఏ సబ్జెక్టులో అయితే వెనుకబడి ఉంటామో దానికి గల కారణాలను విశ్లేషించుకోవాలి. వాటిని సరిదిద్దుకోవాలి. టెస్ట్ సిరీస్‌లు రాయాలి. ఎప్పటికప్పుడు కరెంట్ అఫైర్స్ ఫాలో అయితే ఇబ్బంది ఉండదు.

## అమ్మ కల కోసం వైకల్యాన్ని ఎదిరించి

సెరిబ్రల్ పాల్సీతో చక్రాల కుర్చీకే పరిమితమైనా అమ్మ కల కోసం సివిల్స్‌లో ర్యాంక్ సాధించింది ఏకే సారిక. ఆమె సాధించిన విజయన ప్రస్థానం ఆమె మాటల్లో..

ఏకే సారిక
**922వ ర్యాంక్**

**కుటుంబ నేపథ్యం**

- మాది కేరళ రాష్ట్రం, కోళికోడ్ జిల్లాలోని వటకర. నాన్న శశి, తల్లి రాజి. నాన్న ఖతార్‌లో ఉద్యోగం. పిల్లలను బాగా చదివించాలని అమ్మ కలలు కనేది. తొలి కాన్పులో సెరిబ్రల్ పాల్సీతో పుట్టాను. నడుం కింది భాగం, కుడి చేయి పని చేయవు. జీవితాంతం చక్రాల కుర్చీలోనే గడపాలి. వైకల్యంతో పుట్టిన ఆడపిల్లనెలా పెంచగలవని బంధువులంతా అమ్మను హేళన చేశారు. అయినా అమ్మ అవేమీ పట్టించుకోకుండా, ధైర్యం కోల్పోకుండా నడవలేకపోతున్న నన్ను ఉన్నత స్థానంలో నిలబెట్టాలనుకుంది.



- చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాను. సమయాన్నంతా చదువుకే కేటాయించేదాన్ని. నా పనులన్నీ అమ్మే చేసేది. ఇందుకు అమ్మ కోసం ఏదైనా చేయాలనిపించే ఆలోచనలోంచే సివిల్స్ లక్ష్యం పుట్టుకొచ్చింది.

**చదువు**

- ఇంటర్ పూర్తయ్యాక డిగ్రీ కోసం ఇంటికి 8 కి.మీ. దూరంలోని కాలేజీలో చేర్పించారు. అమ్మ నన్ను రోజూ కాలేజీకి తీసుకెళ్లి, అక్కడ నా స్నేహితులకు జాగ్రత్తలు చెప్పేది. టీచర్లు, ఫ్రెండ్స్ ప్రోత్సాహంతో బీఏ ఇంగ్లిష్ లిటరేచర్ పూర్తి చేశాను.
- శిక్షణ లేక మొదటి ప్రయత్నంలో మెయిన్స్ పాస్ కాలేకపోయాను. చాలా బాధతో తీవ్ర ఒత్తిడికి, ఆందోళనకు గురయ్యాను. అమ్మ ఇచ్చిన ధైర్యంతో అబ్జల్యూట్ ఐఏఎస్ అకాడమీ స్థాపకులు డాక్టర్ జాన్ ఎస్ కొట్టారం నిర్వహిస్తున్న 'చిత్రశలభం' ప్రాజెక్టులో చేరాను. వైకల్యంతో బాధపడేవారికి ఆయన ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆయన అందించిన సహకారంతో రెండోసారి సివిల్స్‌కు హాజరై పాసయ్యాను. 922వ ర్యాంక్ సాధించాను.

5వ పేజీ తరువాయి

తల్లి లక్ష్మి గృహిణి. మేం ఇద్దరం అన్నదమ్ములం. అన్నయ్య మనీష్‌చంద్రారెడ్డి బీటెక్ పూర్తి చేసి అమెరికాలో ఎంఎస్ చేసి ప్రస్తుతం ఆపిల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో 1 నుంచి 6వ తరగతి వరకు, హనుమకొండ ఎస్ఆర్ పాఠశాలలో 7 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో చదివాను. ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాను.

**ప్రిపరేషన్**

- ఐఏఎస్ అయితే ప్రజా సేవ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించి బీటెక్ పూర్తయిన 2019 నుంచే సివిల్స్‌కు ప్రిపేరయ్యాను. ఇంటి వద్ద ఉండే ప్రిపేర్ అవడం మొదలు పెట్టాను. రోజూ సుమారు 8గంటలు చదివాను. ఏదో చదివాం అనుకుండా చదివినంత సేపు విషయ పరిజ్ఞానం పెంపొందించుకొనేవాడిని. ఎక్కువగా విశ్లేషణ చేసుకొనేందుకు పత్రికలు చదవడం, ఇంటర్నెట్‌లో సర్ఛ్ చేయడం, అప్‌డేట్ కావడం, ప్రీవియస్ సివిల్స్ ప్రశ్నపత్రాలు, ఆన్‌లైన్‌లో పెట్టిన ర్యాంకర్స్ ఆన్సర్‌షీట్స్, నోట్స్ చదవడంతో పాటు విషయాన్ని స్పీడ్‌గా రాయడం ప్రాక్టీస్ చేశాను. ఇందుకు ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. నా కంటే ముందుగా సివిల్స్ ర్యాంక్ సాధించిన స్నేహితుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటూ ప్రిపేరయ్యాను. ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లకు హాజరయ్యేవాడిని.

**ఆప్షనల్ సబ్జెక్ట్**

- సివిల్స్‌లో నా ఆప్షనల్ సబ్జెక్ట్ పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్. ఇందులో 9 రకాల పేపర్లు ఉంటాయి. ముఖ్యంగా జనరల్ స్టడీస్‌కు లక్ష్మీకాంత్, హిస్టరీకి స్పెక్ట్రమ్, జాగ్రఫీకి ఎన్‌సీఆర్‌టీ, ఎకనామిక్స్‌కు వివేక్ సింగ్, ఎన్విరాన్‌మెంట్‌కు వైశాలి ఆనంద్, మిగిలిన పేపర్లకు విజయ ఐఏఎస్ అకాడమీ పుస్తకాలు చదివాను. ఆప్షనల్ సబ్జెక్టుకు సంబంధించి శుభ్రారంజన్ నోట్స్‌తో పాటు గతంలో ఆలిండియాలో 5వ ర్యాంకు సాధించిన ఉత్కర్ష్ త్రివేదికి సంబంధించిన నోట్స్‌ను ఆన్‌లైన్ ద్వారా పొంది, ఆయన రాసిన ఆన్సర్లను ఫాలో అయ్యాను. ఈయనతో పాటు ర్యాంకర్లకు సంబంధించిన ఆన్సర్స్‌ను ఏ ప్రశ్నకు ఎలా సమాధానం రాశారని విశ్లేషించుకొని చదివాను.
- మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్ వరకు వెళ్లాను. మూడో ప్రయత్నంలో 217 ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. ఐఏఎస్ సాధించాలనే సంకల్పంతో మరోసారి సివిల్స్ రాయగా గతం కంటే మెరుగైన ర్యాంకు 104 వచ్చింది. జనరల్‌లో ఐఏఎస్‌కు ఎంపికవుతానో లేదో తెలియదు. అవకాశం వస్తే చేరుతాను. లేకపోతే ఐపీఎస్‌లోనే కొనసాగుతాను.

**ఫోబియా నుంచి బయటకు రావాలి**

- సివిల్స్ రాసేవారికి నా సూచన ఏమిటంటే గతంలో మాదిరిగా ఎక్కడికో వెళ్లి కోచింగ్ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే ఉంటూ ప్రశాంతంగా ప్రిపేర్ కావచ్చు. ఇందుకు ఒక ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలి. రోజూ 12, 18 గంటలు చదువుతున్నామని కాకుండా చదివిన సమయంలో ఏం నేర్చుకున్నాం అనేది ముఖ్యం. ఇంటర్నెట్‌లో ప్రతిదీ అందులో అందుబాటులో ఉంటుంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ కోసం నిత్యం పత్రికలు చదువాలి. గతంలోని ప్రశ్నపత్రాలు విశ్లేషించుకోవాలి. ఆన్‌లైన్ వెబ్‌సైట్స్, ర్యాంకర్స్‌కు సంబంధించిన నోట్స్, వారు పరీక్ష రాసిన ఆన్సర్‌షీట్స్‌ను పరిశీలించి పక్కా ప్రణాళికతో ముందుకు సాగితే సివిల్స్ సాధించడం ఇబ్బందేం కాదు. ముఖ్యంగా సివిల్స్ అంటే ఉండే ఫోబియా నుంచి బయటకు రావాలి.